క్లుప్తంగా

థాంక్యూ సీఎం సార్..



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, ఎండీయూ వాహనదారులు

రామభద్రపురం: ఇంటింటికీ రేషన్ అందిస్తున్న ఎండీయూ వాహనదారులకు సైతం వాహన మిత్ర పథకం వర్తింపజేసి, ఏడాదికి రూ.10 వేల ఆర్థికసాయం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణ రావును కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాలసొసైటీ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ, ఎండీయూ వాహనదారుల మండల ప్రెసిడెంట్ ఎస్.కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఔదార్యం

రేగిడి: మండలంలోని ఖండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రాజాంకు చెందిన వాసవీక్లబ్ ప్రతినిధులు శనివారం పరీక్ష కిట్లను అందజేశారు. ప్లాంక్, స్కేలు, ఎరైజర్, పెన్సిల్, హాల్ టికెట్ పెట్టుకునేందుకు పౌచ్‌లు అందులో ఉన్నాయి. వాసవిక్లబ్ ప్రతినిధులకు హెచ్ఎం యు.ఉదయ్‌భాస్కర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీడీఓ పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి రికార్డులు పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అర్హులకే పథకాలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచిచూసి పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వంటకాలు వండి పెట్టాలని తెలిపారు.

చదువుపై ఆసక్తి పెరిగేలా బోధన

బొబ్బిలి రూరల్: విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరిగేలా బోధన చేయాలని ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు సూచించారు. మండలంలోని ఎం.పణుకువలస గ్రామ పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నల ద్వారా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేలా, తార్కిక ఆలోచనాశక్తి పెరిగేలా విద్యాబోధన ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం వంటలు కూడా మెనూ ప్రకారం విద్యార్థులకు వండి పెట్టాలని తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

రామభద్రపురం: ప్రమాదాల నివారణే లక్ష్యమని ఎస్ఐ సురేంద్రనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో శనివారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేసిన ఆయన అటువైపుగా వచ్చిపోయే వాహనదారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు.

హిందీ పరీక్ష ఫలితాలు విడుదల

రాజాం: దక్షిణభారత హిందీ ప్రచార సభ(మద్రాసు) నిర్వహించిన హిందీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని ప్రచారక్ కె.మధుసూదన రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలను ఫిబ్రవరి నెలలో నిర్వహించడం జరిగింది. వాటి ఫలితాలను సభ విడుదల చేసింది. ఫలితాల కోసం 99499 17365 నంబరును సంప్రదించాలని కోరారు.

పెరుమాళిలో రోవర్ సర్వే..

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూముల సరిహద్దు గుర్తింపును వేగవంతం చేస్తున్నట్లు మండల సర్వేయర్ వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని పెరుమాళి గ్రామంలో జరుగుతున్న భూముల సరిహద్దు గుర్తింపు ప్రక్రియను పరిశీలించిన ఆయన సరిహద్దుల గుర్తింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. భూముల రీసర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్ చాలా కీలకమైందని, రోవర్ సహాయంతో సరిహద్దుల గుర్తింపును చాలా జాగ్రత్తగా చేయాలని తెలిపారు. రైతుల సమక్షంలోనే సరిహద్దులు గుర్తిస్తే భవిష్యత్తులో ఎటువంటి భూ తగాదాలు రావన్నారు.

ఏపీ ఫైబర్ నెట్ సేవలు ప్రారంభం

సంతకవిటి: మండలంలో కాకరాపల్లి గ్రామం వద్ద ఏపీ ఫైబర్ నెట్ సేవలను జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు శనివారం ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన నెట్ సేవలతో పాటు డిజిటల్ ప్రసార సేవలు అందించేందుకు ఏపీ ఫైబర్ నెట్ ఉపయోగపడుతుందన్నారు. ఆయనతో పాటు కాకరాపల్లి సర్పంచ్ వి.ధనలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, వావిలపల్లి రమణారావు, మాజీ వైస్ ఎంపీపీ గంట్రేటి కేసరి, మందరాడ ఎంపీటీసీ వావిలపల్లి శ్రీనివాసరావు, నెల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.

గృహప్రవేశాలకు సిద్ధంకండి

- హౌసింగ్ డే కార్యక్రమంలో అధికారులు



బాడంగి: హౌసింగ్ డే కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తెర్లాం: హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణ దశలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఉగాదికి అందరూ నిర్మాణాలు పూర్తి చేసి, సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని కోరారు. ఇంటి నిర్మాణ సామగ్రి పంపిణీ, బిల్లుల చెల్లింపులో ఎటువంటి జాప్యం లేనందున అందరూ నిర్మాణాల పూర్తికి ముందుకు రావాలన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లి గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య, ఏఈ డి.సింహాచలం కలిసి, అక్కడి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఉగాది నాటికి ప్రభుత్వం చేపట్టే సామూహిక గృహప్రవేశాలకు అందరూ సిద్ధం కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి ఎం.యశోదనరావు శనివారం పరిశీలించారు. గ్రామంలో మొత్తం 63 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు మూడు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉగాది పండగ రోజున జగనన్న కాలనీ ఇళ్లల్లో సామూహిక గృహప్రవేశాలకు సిద్ధమవుతున్న వేళ నిర్మాణాల్లో ఇలా జాప్యం చేయడం తగదన్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. అయితే మండలానికి మొత్తం 975 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 845 ఇళ్లు పూర్తి కావచ్చాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సత్యం, ఎంపీడీఓ అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులతో ఎంపీడీఓ బాసూరి శంకరరావు సమావేశమై.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సచివాలయాల ద్వారా సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. శ్లాబ్ నిర్మాణాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు ఉగాదికి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్ పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని తమరాం గ్రామంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహాలను ఎంపీడీఓ శృంగవరపు రఘునాథాచారి వివరించారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: లబ్ధిదారులకు సూచనలిస్తున్న అధికారులు



తెర్లాం: లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు



రాజాం: పొగిరిలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శంకరరావు



సంతకవిటి: తమరాంలో హౌసింగ్ డే నిర్వహిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

జాగ్రత్తలతో క్షయవ్యాధి నివారణ



ఉపాధి వేతనదారులకు క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బాడంగి: క్షయవ్యాధి ప్రాణాంతకమైన జబ్బు కాదని, కొద్దిపాటి జాగ్రత్తలు పాటించి, క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందని టీబీ యూనిట్ పర్యవేక్షకులు రమేష్, గిరిజ తెలిపారు. మండలంలోని వాడాడ పీహెచ్‌సీ, పాఠశాల, ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో క్షయవ్యాధి నివారణపై శనివారం అవగాహన కల్పించారు. రెండు వారాల నుంచి ఎడతెరిపిలేని దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, కఫంలో రక్తజీర రావడం వంటివి వస్తే వ్యాధి లక్షణాలని, ఇవి కనిపించిన వెంటనే ఆస్పత్రిని సందర్శించాలన్నారు. ప్రతీ టీబీ పేషెంట్‌కు ఉచితంగా పౌష్టికాహారం సరఫరా చేయడంతో పాటు నెలకు రూ.500 నగదు వారి అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందన్నారు.

ఉపాధి పనుల వద్ద వసతులు తప్పనిసరి



రాజాం: కంచరాంలో ఉపాధిపనుల వద్ద వేతనదారుల హాజరుపై ఆరా తీస్తున్న అధికారులు

రాజాం: ఉపాధి పనుల వద్ద వేతనదారులకు కనీస వసతులు కల్పించాలని ఎంపీడీఓ బి.శంకరరావు సూచించారు. మండలంలోని కంచరాం పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. పనిలో పాల్గొన్న వేతనదారుల సంఖ్యతో మస్తర్లను సరిచూశారు. నిర్దేశించిన కొలతల మేరకు రెండు పూటలా పనులు చేసినట్లయితే గిట్టుబాటు వేతనం పొందవచ్చన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం, సాయంత్ర సమయాల్లో పనులు చేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని, నీడ కోసం టార్పాలిన్లతో టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏపీఓ సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్ పోలినాయుడు తదితరులు ఉన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



పంపుహౌస్‌లో వివరాలు నమోదుచేస్తున్న ఎస్ఈ రాజారావు

రాజాం సిటీ: వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ కె.రాజారావు అన్నారు. రాజాం మున్సిపాలిటీకి నీటి సరఫరా కోసం సంకిలి నాగావళి నది వద్ద ఏర్పాటు చేసిన హెడ్‌వాటర్ పంపుహౌస్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ఎక్కడికక్కడ నీటి నిల్వలు, క్రాస్‌బండ్లు అవసరాన్ని గుర్తించి అందుకు తగ్గట్టుగానే పైపులైన్, బోర్‌వెల్స్ మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయించనున్నామని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. ఆయనతోపాటు ఈఈ కె.దక్షిణామూర్తి, మున్సిపల్ ఏఈ రత్నాకర్ ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా డోలాపూర్ణిమ తర్వాత స్వామి కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తోంది. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ జరిగిన స్వామి కల్యాణం తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



నల్లరిబ్బన్లతో ఆందోళన చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు శనివారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రాజారావు, హెచ్‌డీటీ బి.గౌరీశంకర్, ఆర్ఐ కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో వెలుగు సిబ్బంది, మహిళలు

బొబ్బిలి రూరల్: అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవంలో భాగంగా మండలంలోని అలజంగి గ్రామంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం పీపీ స్వామి, సీసీ కోటేశ్వరరావు కలిసి, చిరుధాన్యాల ప్రయోజనాలను వివరించి, ప్రతీ రైతు చిరుధాన్యాల సాగుకు ఆసక్తి చూపాలని కోరారు.

చిరుధాన్యాల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లి గ్రామంలో చిరుధాన్యాల పంపిణీ శనివారం చేపట్టారు. రైతు భరోసా కేంద్రాల్లో చిరుధాన్యాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని ఏడీఏ ఎం.శ్యామసుందర్ తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

రాజాం సిటీ: పీహెచ్‌సీల్లో వైద్యసేవలు విస్తృతం చేయాలని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. పొగిరి పీహెచ్‌సీలో శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఓపీ పెరిగేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఫీవర్ సర్వేను సక్రమంగా చేపట్టాలని, ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగేలా సేవలందించాలన్నారు. ఆరోగ్య సేవలపై అలసత్వం వహిస్తే సహించేదిలేదన్నారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, వైద్యాధికారులు ఆకిరి భార్గవ్, బీవీ సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మిల్లెట్స్ మహోత్సవ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న మహిళలు

సంతకవిటి: మండలంలో గుళ్లసీతారాంపురం గ్రామంలో శనివారం వైకేపీ ఆధ్వర్యంలో మిల్లెట్స్ మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలుత గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామైఖ్య సంఘం సమావేశమై.. చిరుధాన్యాల సాగు ఆవశ్యకత, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఏపీఎం సీతారాం వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, వైకేపీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8 వేల గాలికుంటు నివారణ టీకాల పంపిణీ



బొత్సవానివలసలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బాడంగి: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి వి.గోవింద్ తెలిపారు. మండలంలోని బొత్సవానివలస, ముగడ, పెదపల్లి గ్రామాల్లోని పశువులకు శనివారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 13,400 టీకాలు రాగా, ఇప్పటివరకు 8 వేల పశువులకు టీకాలు వేశామని పేర్కొన్నారు. మండలంలోని 12 పంచాయతీల్లో టీకాల పంపిణీ జరిగిందని, మరో 13 పంచాయతీల్లో పశువులకు టీకాలు వేయాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరులో టీకాల పంపిణీ పూర్తి చేస్తామన్నారు.

అంగన్‌వాడీల తనిఖీ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చక్కగా ఉండాలని రాజాం అడిషనల్ సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని ఉంగరాడమెట్ట, కె.ఎం.వలస, వండానపేట, చాటాయవలస తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ప్రీ స్కూల్ విధానాన్ని పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించాలి

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధి పనులపై సమీక్షించిన ఆయన సాంకేతిక సహాయకులంతా గ్రామాల్లో కొత్త పనులను గుర్తించాలని, వాటికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులతో వాటికి ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులు కావాలని కోరిన ప్రతీ వేతనదారునికి పనులు కల్పించాలని, కొలతల ప్రకారం పనులు చేస్తున్నారా, లేదా గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందా లేదా అని కూడా తెలుసుకోవాలన్నారు. గ్రామ సచివాలయాల్లో ఈ–సర్వీసుల ద్వారా వచ్చే నగదు ప్రభుత్వ ఖాతాకు వెంటవెంటనే జమచేయాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

సంతకవిటి: వాసుదేవపట్నం కేజీబీవీని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఓ శోభారాణి వద్ద విద్యార్థుల హాజరుపై ఆరాతీశారు. అనంతరం సఖి గ్రూపు సభ్యులతో పాటు విద్యార్థినులకు బాలికల విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

పన్ను వసూలు వేగవంతం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో ఇంటిపన్ను బకాయిల వసూళ్లను అధికారులు ముమ్మరం చేశారు. కొత్తవలస గ్రామంలో శనివారం ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేశారు. ఈ నెల 31లోగా పన్ను బకాయిలు చెల్లించినట్లయితే వడ్డీ రాయితీ పొందవచ్చని మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు తెలిపారు. పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జీడితోటల పరిశీలన

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో ఇటీవల పలువురి రైతులకు చెందిన జీడితోటలు కాలిపోయాయి. శనివారం రెవెన్యూ అధికారులు ఆర్ఐ రేవతి, వీఆర్ఓ గోపాలనాయుడులు సర్పంచ్ బుడుమూరు పట్టాభితోకలిసి పరిశీలించారు. ఆరుగురు రైతులకు సంబంధించి 3.50 ఎకరాల విస్తీర్ణంలో తోటలు కాలి పోయినట్లు నివేదికను తహసీల్దార్‌కు అందజేయనున్నామని ఆర్ఐ తెలిపారు.

ఘనజీవామృతంతో నేల సారవంతం



ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: భూసారానికి ఘనజీవామృతం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. పొగిరి గ్రామంలో రైతులకు ఘనజీవామృతం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఘనజీవామృతం తయారీని వివరించారు. దీన్ని పొలంలో వేసుకోవడం ద్వారా నేల పొరల్లో సేంద్రియ కర్బనం వృద్ధి చెందుతుందని, పంటకు కావాల్సిన నత్రజని, బాస్వరం, పొటాష్ వంటివి పుష్కలంగా లభిస్తాయన్నారు. డీఏపీ బదులుగా ఎకరానికి 400 కేజీల వరకు ఘనజీవామృతాన్ని పొలంలో వేసుకుని దుక్కి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.రమాదేవి, ఐసీఆర్‌పీ పి.వెంకటరమణ, పి.భారతి, జి.తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

జీఎంఆర్‌ఐటీలో రక్తదానం

రాజాం సిటీ: రక్తదానంపై యువత అపోహలు వీడి రక్తాన్ని దానం చేసేందుకు ముందుకురావాలని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్‌లు అన్నారు. శనివారం స్థానిక జీఎంఆర్ ఐటీలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లా శాఖల రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక వ్యక్తి దానం చేసిన రక్తంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఆరోగ్యవంతులైన యువత ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. శిబిరంలో 250 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ శశిధర్, రెడ్‌క్రాస్ రాజాం సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ కేవీఎస్ ప్రసాద్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి యశోదనరావు

బాడంగి: మండల అభివృద్ధికి సహకరించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.యశోదనరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలువురు అధికారులతో సమావేశమైన ఆయన అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా నెలవారీ ప్రగతి నివేదికలు తయారు చేసి సమర్పించాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. వేసవికాలం నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లనిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ అక్కారావు, ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం



సంతకవిటి: శ్రీహరినాయుడుపేట వద్ద పడిపోయిన మొక్కజొన్న పంటను కట్టలుకడుతున్న రైతు



రేగిడి: అంబకండిలో పూతదశలో నేలకొరిగిన నువ్వుల పంట

సంతకవిటి/రేగిడి: అకాల వర్షాల కారణంగా మండలంలో పలు చోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. చేతికంది వస్తుందనుకున్న పంటలు నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శ్రీహరినాయుడుపేట, గోళ్లవలస, మోదుగులపేట, మల్లయ్యపేట, శేషాద్రిపురం, గరికిపాడు తదితర గ్రామాల్లో రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట నేలకొరిగింది. పడిపోయిన పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. సుమారు 80 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని అంచనా.

రాజీయే రాజమార్గం

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: రాజీయే రాజమార్గమని, అందుకు లోక్‌అదాలత్ చక్కని వేదిక అని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారుల అంగీకారంతో చట్టరీత్యా రాజీకి అనుకూలమైన కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అదాలత్ తీర్పే అంతిమమన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారమైన సివిల్ కేసులకు సంబంధించి కోర్టు ఫీజులు వాపసు వస్తాయన్నారు. ఈ అదాలత్‌లో ఐదు క్రిమినల్ కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచరాన రమణమూర్తి, ఏజీపీ ఎస్.పోలారావు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన

రాజాం: రాజాంలో జీఎంఆర్ ఐటీ కళాశాలలో శనివారం ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ వైవిధ్యభరితంగా సాగింది. కళాశాలలో ఈసీఈ విభాగం తృతీయ సంవత్సర విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్ నిర్వహించగా.. రాజాం పరిసర ప్రాంతాలకు చెందిన పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వాటిని తిలకించి, కొత్తకొత్త విషయాలను తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. కళాశాల ఈసీఈ విద్యార్థులు ఈ ఏడాది 44 ప్రాజెక్ట్‌లు రూపొందించి పలు యూనివర్సిటీలు, కళాశాలల్లో జరిగిన పోటీల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వి.జగన్ నవీన్, టెక్నికల్ కోఆర్డినేటర్ టంకాల బుచ్చింనాయుడు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, అకడమిక్ డీన్ డాక్టర్ ఎంవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆల్బెండోజోల్ మాత్రల పంపిణీపై ఆరా

రాజాం: నులిపురుగుల నివారణ వారోత్సవాల్లో భాగంగా రాజాం పట్టణం, మండలాల్లో చేపట్టిన ఆల్బెండోజోల్ మాత్రల పంపిణీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించారు. పట్టణంలోని కొత్తవలస పాఠశాలను రాష్ట్రీయ కిశోర్ స్వచ్ఛ కార్యక్రమ జిల్లా ప్రాజెక్ట్ అధికారి పి.రవికుమార్, ఎంపీహెచ్ఈఓ ఎపిడిమిక్ సెల్ ఆఫీసర్ జె.సత్తిరాజె, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ ఎల్.ప్రశాంత్ సందర్శించారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ వివరాలను హెచ్ఎం కుదమ తిరుమలరావు వద్ద సేకరించారు.